



# కరపత్రం

SINCE 2014

గురువారం జూలై 02, 2026 | సంపుటి : 2 | సంచిక : 260 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




2 లో

## అనలాగ్, మెగా సంస్థల

# సంయుక్త భాగస్వామ్యం

### ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత

- సిఎం రేవంత్‌తో భేటీ అయినా మేఘా కృష్ణారెడ్డి
- అన్‌లాగ్ సిఇవో అలెక్స్ కిప్‌మాన్

**హైదరాబాద్,జూలై1 :**
ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు.
అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. గరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు. సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు.

# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

### ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి

- శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం



2లో..

**హైదరాబాద్,జూలై1:**
ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ఎఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్దిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు.

# వైఫల్యాలపై దృష్టి మరల్చే ఎత్తులు

- రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీసారు
- అన్నదాతల అసలు సమస్యలపై పట్టింపేది
- వైఫల్యాలపై చర్చకు సిద్దంగా ఉన్నాం
- సిఎం రేవతంంకు హరీష్ రావు సవాల్



2లో..

**హైదరాబాద్,జూలై1:**
శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని హరీష్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ. 1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రూ. 1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని,



2 లో

## రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

» తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,జూలై1 :**
రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె విమర్శించారు.

## కేసీఆర్ గొప్పగా పాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారు -జూపల్లి



**హైదరాబాద్:**
కేసీఆర్ గొప్పగా పరిపాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని ఆయన అప్పుల పాల్జేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేసిన నేపథ్యంలో జూపల్లి స్పందించారు. కేసీఆర్ చేసిన అప్పులపై శాసనసభలో లెక్కలతో సహా రుజువు చేశామన్నారు. రాష్ట్ర ప్రజల జేబులకు చిల్లు పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న అప్పు ఎవరు కడతారని జూపల్లి ప్రశ్నించారు. ఇదే అంశాన్ని శాసనసభలో అడిగితే ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పలేదన్నారు.

## ఆరోగ్య పరిరక్షణలో

# ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

» నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి
» డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర



2లో..

**హైదరాబాద్,జూలై1 :**
డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు.

## రేవంత్.. చర్చకు నేను రెడీ..

# డేట్, టైమ్ ఫిక్స్ చేయండి: కేటీఆర్ సవాల్



**హైదరాబాద్:**
కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ. 3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమాఅని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు.

మిగతాద్ది 2 లో

## రేవంత్ రెడ్డికి రైతులు బుద్ది చెప్పడం ఖాయం

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




2లో..

**నిజామాబాద్,జూలై1 :**
రైతులను అడుగడుగునా ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

## ఇజ్జత్ పోయేదానికి

# ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి

- తెలంగాణను పదేపదే కించ పరుస్తున్న రేవంత్
- కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా
- కోటి ఎకరాల మాగాణంగా కెసిఆర్ తీర్చిదిద్దారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై మేం చర్చకు సిద్ధమే
- తేదీ సమయం చెబితే రావడానికి రెడీగా ఉన్నాం
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్



2 లో

**హైదరాబాద్,జూలై1 :**
కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ. 3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు.

# ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమాఅని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగేపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజనీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి ఫోన్ చేసి అభినందించారు. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ కూడా గతంలో హైదరాబాద్‌పై ప్రశంసలు కురిపించారు. సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా కాకి లెక్కలు నమ్మాలా సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్ధాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు. అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనాప్రెస్‌క్లబ్‌లోనాజూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా 2లక్షల ఉద్యోగాలు అని రాహుల్‌గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా మీరొస్తారో, రాహుల్‌గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా' అని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్.. చర్చకు నేను రెడీ.. డేట్, టైమ్ ఫిక్స్ చేయండి: కేటీఆర్ సవాల్

మొదటిపేజీ తరువాయి

**కేంద్రం సహకరించకపోయినా అద్భుతాలు చేశాం**

"తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగేపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజనీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి ఫోన్ చేసి అభినందించారు. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ కూడా గతంలో హైదరాబాద్‌పై ప్రశంసలు కురిపించారు.

**కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు**

సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా కాకి లెక్కలు నమ్మాలా సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్ధాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు.

**వైఫల్యాలు ఎండగట్టకపోతే రాజకీయాల నుంచి తప్పుకొంటా**

అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనాప్రెస్‌క్లబ్‌లోనాజూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా 2లక్షల ఉద్యోగాలు అని రాహుల్‌గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా మీరొస్తారో, రాహుల్‌గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా" అని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు.

# ప్రకృతితో కూడిన అభివృద్ధే శాశ్వతం

**-కాంక్రీట్ జంగిల్ మధ్య 'గ్రీన్ లంగ్స్'గా నగర వనాలు**
**-రూ. 36 కోట్ల వ్యయంతో 18 నగర వనాల అభివృద్ధి**
**-అటవీ సంపద, సాంప్రదాయాల కలబోతగా నిర్మాణం**
**-వినోదం, ఆరోగ్యం ఒకే చోట ఉండేలా ప్రత్యేక సౌకర్యాలు**
**-రాష్ట్ర వ్యాప్తంగా 18 నగర వనాలను వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్**

'ఏ దేశమైతే ప్రకృతితో కలిసి ఎదుగుతుందో, ఆ దేశం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ప్రకృతితో పాటు సాధించే అభివృద్ధే శాశ్వతంగా ఉంటుంది' అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మన వారసత్వం అనేది కేవలం మనం నిర్మించిన కట్టడాలు కాకూడదని, మనం కాపాడిన ప్రకృతి అయి ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టులను బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. వర్చువల్ గా ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగరాలు, పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ నగర వనాలు పట్టణాలకు గ్రీన్ లంగ్స్ లాగా పని చేస్తూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. కేంద్ర ప్రభుత్వ 'నగర వన యోజన' నిధులతో పాటు స్థానిక నిధులను సమకూర్చుకుంటూ రూ. 36 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును సిద్ధం చేశాం. ఒక్కో నగర వనాన్ని సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో, రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించాం. కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ప్రత్యేకంగా ఎర్రచందనం పరిరక్షణ పార్కులను ఏర్పాటు చేశాం. మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ జ్ఞానాన్ని చాటి చెప్పేలా, జీవవైవిధ్య పరిరక్షణే ధ్యేయంగా నక్షత్ర వనాలు, రాశి వనాలను అభివృద్ధి చేశాం. ఈ పార్కులు కేవలం పచ్చదనాన్ని ఇవ్వడమే కాకుండా, ప్రజల శారీరక, మానసిక ఉల్లాసానికి కేంద్రాలుగా నిలవనున్నాయి. ఇందులో పక్షుల ఆవాసాలు, బోటింగ్, కయాకింగ్ (చిన్న పడవలు నడపడం), ట్రెకింగ్ పాయింట్లు, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలను అందుబాటులోకి తీసుకొచ్చాం.

కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ఆధునిక నగరాలలో, అలసిన మనుషులకు ఈ నగర వనాలు ప్రకృతిలోని ప్రశాంతతను పరిచయం చేస్తాయి. ఇవి కేవలం నేటి అవసరాల కోసమే కాదు, రాబోయే తరాల కోసం మనం అందిస్తున్న పచ్చని వారసత్వం. ప్రతి ఒక్కరూ వీటిని కాపాడుకుంటూ, మరింత పచ్చని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి' అని పిలుపు నిచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ "నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉన్న నగర వనాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించాను. పచ్చదనం, ప్రశాంతతో పాటు ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు కుటుంబంతో కలిసి సమయం గడపడానికి ఎంతో అద్భుతంగా ఉన్నాయి. నగర వనానికి సమీపంలోనే ఉన్న గుట్టను, దానిపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని ఈ పార్కుతో అనుసంధానం చేస్తే బాగుంటుంది. పార్కును, గుట్టను కలిపి ట్రెకింగ్ పాయింట్ గా అభివృద్ధి చేస్తే, అది నగరవాసులకు ఒక సరికొత్త ఆధ్యాత్మిక, సాహస పర్యాటక అనుభూతిని అందిస్తుంద"న్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, గౌతు శిరీష, డా. బి.వి.జయనాగేశ్వర రెడ్డి, డా.పార్థసారధి, మహమ్మద్ షాజహాన్ బాషా, అటవీ పర్యావరణశాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లిఖార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, ఐ.టి. అడ్వైజర్ పి. నాగేశ్వరరావు, డి.సి.ఎఫ్. ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# టూ వీలర్ రంగంలో సరికొత్త విప్లవం

**- రాష్ట్రంలో తొలుత 750 కోట్ల రూపాయల పెట్టుబడి**
**- హీరో మోటోకార్ప్ సంస్థ చైర్మన్ పవన్ ముంజాల్ వెల్లడి**

భారతదేశ టూ వీలర్ రంగంలో తిరుపతి కేంద్రంగా సరికొత్త విప్లవం రాబోతోంది. దేశీయ మోటార్ సైకిల్ మార్కెట్లో 2001 సంవత్సరం నుంచి ఇప్పటివరకు మొదటి స్థానంలో కొనసాగుతున్న ప్రముఖ సంస్థ 'హీరో మోటోకార్ప్', ఆంధ్రప్రదేశ్‌లో తన వ్యాపారాన్ని భారీగా విస్తరించడానికి సిద్ధమైంది. తిరుపతిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ చైర్మన్ పవన్ ముంజాల్ ఏపీలో రాబోయే ప్రాజెక్టులకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలుత 750 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టబోతున్నామన్నారు. తర్వాత రాబోయే మూడు నుంచి ఐదేళ్ల కాలంలో ఈ పెట్టుబడులను ఏకంగా 3,200 కోట్ల రూపాయలకు పెంచనున్నట్లు పవన్ ముంజాల్ ప్రకటించారు. వాహనాల తయారీ రంగంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైన పాత్ర పోషించబోతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశ వ్యాప్తంగా హీరో సంస్థకు ఉన్న ఆరు తయారీ పరిశ్రమల కంటే తిరుపతిలో ఏర్పాటు కాబోతున్న ఈ సరికొత్త పరిశ్రమ పరిమాణంలోనూ, ఉత్పత్తిలోనూ అన్నింటికంటే అతిపెద్దది కాబోతుండటం విశేషం. ఈ భారీ పరిశ్రమ స్థాపన ద్వారా స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ దాదాపు 4,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎనలేనిదని కొనియాడిన ముంజాల్, చంద్రబాబు నాయుడు ఆశయమైన 'స్వర్ణాంధ్ర' సాధన విజన్‌లో హీరో సంస్థ కూడా భాగస్వామి కాబోతోందని సంతోషం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనతో పాటు సామాజిక బాధ్యతలోనూ హీరో సంస్థ ముందుంటుందని ఆయన చాటిచెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మహిళా పోలీసుల రక్షణ, విధుల నిర్వహణ కోసం తమ సంస్థకు చెందిన అత్యాధునిక 'వీడా' ఎలక్ట్రిక్ వాహనాలను అందించనున్నట్లు ప్రకటించారు. దీనితో పాటు ఆంధప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ తరఫున ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని పవన్ ముంజాల్ హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా అటు పారిశ్రామికంగా, ఇటు సామాజికంగా ఏపీ అభివృద్ధిలో హీరో మోటోకార్ప్ కీలక భాగస్వామి కానుంది.

## పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎపి
## తిరుపతిలో హీరో మోటార్స్ జీపీసీకి శంకుస్థాపన

**అందుబాటులో నైపుణ్యం కలిగిన మానవ వనరులు**
**హీరో సంస్థ ఎపికి రావడానికి ప్రత్యేక కృషి చేశా**
**సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దు తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతిలో హీరో మోటార్స్ జీపీసీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హీరో సంస్థ తిరుపతికి రావడానికి తాను ప్రత్యేకంగా కృషి చేశానని, మరో రాష్ట్రానికి వెళ్లాల్సిన సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో కొత్త తరం బ్యాటరీ ఆధారిత వాహనాల తయారీ కూడా తిరుపతిలోని హీరో ఎ÷-లాంట్‌లోనే జరగనుందని వెల్లడించారు. ఆంధప్రదేశ్ యువత ప్రతిభావంతులని, ప్రపంచ స్థాయి సాంకేతికతను అందిపుచ్చుకునే సామర్థ్యం వారికి ఉందని చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యధికంగా ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులు ఉన్న రాష్ట్రం ఆంధప్రదేశ్ అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాలు, పోర్టులు, రోడ్లు, రైల్వే అనుసంధానం, విద్యుత్, నీటి వనరులు పరిశ్రమలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. త్వరలో దుగ్గరాజుపట్నం పోర్టు, నాలుగు లైన్ల రైల్వే మార్గాలు అందుబాటులోకి రావడంతో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యమని, ఇప్పటికే రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడించారు. వీటి ద్వారా సుమారు 10 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. ఒకసారి ఎంఓయూ కుదిరిన తర్వాత ఆ ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్‌ను 2028 డిసెంబర్‌లోగా ప్రారంభించేలా చర్యలు కొనసాగుతున్నాయని, అమరావతిలో వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటింగ్ తయారీకి సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. హీరో సంస్థ మహిళా పోలీసులకు 63 వాహనాలను అందించడం అభినందనీయ మని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే 'పీ4' కార్యక్రమంలో హీరో సంస్థ భాగస్వామ్యం కావడాన్ని స్వాగతిస్తూ, పరిశ్రమ ఉన్న ప్రాంతంలో సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక సీఈవోను నియమించాలని సూచించారు. మానవ వనరుల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి కీలకమని, లక్షలాది మంది యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## ఆరోగ్య పరిరక్షణలో
# ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

మొదటిపేజీ తరువాయి

ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అ÷-దదె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి రాష్ట్రంలోని వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## అనలాగ్, మెగా సంస్థల
# సంయుక్త భాగస్వామ్యం

మొదటిపేజీ తరువాయి

వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఎఐ కి అనుసంధానించాలని సీఎం సూచించారు. మావేశం అనంతరం ముఖ్యమంత్రి గారి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

మొదటిపేజీ తరువాయి

పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బ్జడెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బ్జడెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బ్జడెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

మొదటిపేజీ తరువాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ, మరోవైపు మూసీ ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత అన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అజెండా మారుస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత సూచించారు.

# రేవంత్ రెడ్డికి రైతులు బుద్ధి చెప్పడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

రైతు ఆశీర్వాద సభ అంటూ నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా తన ప్రసంగాన్ని కొనసాగించారని ఆరోపించారు. ప్రజాధనంతో సభలు ఏర్పాటు చేసి ఆశీర్వాద సభను శాపనార్థాల సభగా మార్చారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాడని రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. మోసంచేసే పార్టీని ఏ విధంగా రైతులు ఆశీర్వాదిస్తారని పేర్కొన్నారు. 2018 లో కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్ రెడ్డి మూడు నెలల్లో ఎంపీ ఎలక్షన్లో నిలబడటం సిగ్గుచేటన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మూడు లక్షల పెళ్లిళ్లు అయ్యాయని గుర్తు చేశారు. లబ్ధిదారులకు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

**- పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ దాడి**


హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నారనే సమాచారంతో అతన్ని పట్టుకునేందుకు నల్లగొండ సీసీఎస్ పోలీసుల బృందం అక్కడకు వెళ్లింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులపై తిరగబడి కత్తితో దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు గాయమైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్ చిన్న చిన్న దొంగతనాలు చేస్తుండేవాడు. 2007లో అతడిని అరెస్టు చేసే క్రమంలో కానిస్టేబుల్ వేణుబాబును చంపి పారిపోయాడు. అప్పటి నుంచి 120కిపైగా పైగా నేరాలు చేశాడు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే అతనిపై సుమారు 300 వరకు కేసులు ఉన్నాయి. దీంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శ్రీకాంత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారం తెలియడంతో సీసీఎస్ పోలీసుల బృందం వెళ్లింది. బొంగులూరు ఎగ్జిట్ వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో తప్పించుకునేందుకు శ్రీకాంత్ కత్తితో పోలీసులపై దాడికి దిగాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. తర్వాత నిందితుడి కాళ్లపై కాల్చారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తలకు గాయమైంది. దీంతో హెడ్ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడి తలకు గాయం కావడంతో హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆస్పత్రికి తరలించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 02, 2026

# పాస్ పోర్ట్,ఆధార్ కార్డ్

# భారత పౌరసత్వానికి రుజువు కాదు

■ బోయిని సత్యనారాయణ,అడ్వకేట్




భారత పౌరసత్వ నిరూపణకు ఆధార్ కార్డ్ గానీ,భారత పాస్ పోర్ట్ గానీ రుజువులుగా సరిపోవని పేర్కొంటూ భారత అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన రూలింగ్ ఇప్పుడు చర్చకు దారి తీసింది.

పౌరునికి,పౌరసత్వానికి మధ్య గల తేడా ఏమిటని మేధావులను కూడా ఆలోచనల్లో పడేసింది.భారత పౌరసత్వం పై, భారత చట్టాలపై, భారత రాజ్యాంగంపై లోతైన అవగాహన లేని సామాన్యులు.. అసలు పౌరసత్వం అంటే ఏమిటి అనే విషయం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

భారత దేశ సుప్రీంకోర్టు ఈ విషయంపై వెలువరించిన రూలింగ్ ఏమిటో తెలుసుకుందాం.

**పౌరసత్వ సవరణ చట్టం-2019 (CAA)** రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వందలాది పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధానంగా WP (C) No. 1470/2019 (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ మరియు ఇతరులు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా) అనే ప్రధాన కేసు ద్వారా పరిశీలించింది.భారతీయ పౌరసత్వంపై సుప్రీంకోర్టు ఇచ్చిన కీలకమైన ఆదేశాలు మరియు తీర్పుల సారాంశం క్రింది విధంగా ఉంది:

### పౌరసత్వానికి పాస్‌పోర్ట్, ఆధార్ రుజువులు కావు

ఎవరికైనా భారతీయ పాస్‌పోర్ట్ లేదా ఆధార్ కార్డు, ఓటరు ఐడీ ఉన్నంత మాత్రాన వారికి భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని సుప్రీంకోర్టు మరియు భారత విదేశాంగ శాఖ స్పష్టం చేశాయి. ఇవి కేవలం గుర్తింపు లేదా నివాస ధ్రువపత్రాలు మాత్రమే.

**పౌరసత్వ చట్టం సెక్షన్ 6A రాజ్యాంగబద్ధత (అస్సాం ఒప్పందం)**

భారత పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6A రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది. దీని ప్రకారం.. 1966 జనవరి 1 కంటే ముందు అస్సాంకు వచ్చి స్థిరపడిన విదేశీయులకు మరియు 1966 జనవరి 1 నుండి 1971 మార్చి 25 మధ్యకాలంలో బంగ్లాదేశ్ నుండి భారత్‌లోకి ప్రవేశించి నివసిస్తున్న వారికి పౌరసత్వం వర్తిస్తుంది.

### పౌరసత్వం నిరూపించుకునే మార్గాలు

భారత రాజ్యాంగం మరియు Citizenship Act, 1955 ప్రకారం, భారతీయ పౌరసత్వాన్ని 5 మార్గాల ద్వారా మాత్రమే పొందవచ్చు.

**పుట్టుక**

దేశంలో జన్మించడం ద్వారా.వంశపారంపర్యం తల్లిదండ్రులు భారత పౌరులై ఉండటం ద్వారా.నమోదు (Registration): నిర్దిష్ట నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవడం.

**సహజీకరణ**

Naturalisation..భారతదేశంలో నిర్దిష్ట కాలం పాటు నివసించి పౌరసత్వం పొందడం.

**ప్రాదేశిక విలీనం**

Incorporation of Territory.. భారత భూభాగంలో కొత్త ప్రాంతాలు కలవడం ద్వారా.

### పౌరసత్వ సవరణ చట్టం (CAA 2019)

పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుండి మతపరమైన వేధింపుల కారణంగా 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌కు వలస వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతాలకు చెందిన శరణార్థులకు భారత




పౌరసత్వం కల్పించే పౌరసత్వ సవరణ చట్టాన్ని Citizenship (Amendment) Act, 2019 సుప్రీంకోర్టు పరిశీలించింది.

**■ ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణలు జరిపింది.**

### ఈ విచారణకు సంబంధించిన ప్రధాన కేసు

Indian Union Muslim League (IUML) & Ors. v. Union of India & Ors. in Writ Petition (Civil) No. 1470 of 2019.

### అనుబంధ పిటిషన్లు

ఈ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్, అసదుద్దీన్ ఒవైసీ, కేరళ ప్రభుత్వం సహా దాదాపు 250కి పైగా ఇతర పిటిషన్లు దాఖలు కాగా, వాటన్నింటినీ ఈ ప్రధాన కేసుకు జత చేసి సుప్రీంకోర్టు విచారిస్తోంది.

**■ భారత పౌరసత్వం మరియు పౌరసత్వ సవరణ చట్టం (CAA) పై చట్టపరమైన చర్చ ఇంకా ముగియలేదు. ఈ అంశం ప్రస్తుతం దేశంలో అత్యంత క్రియాశీలకంగా విచారణలో ఉంద్ని**

**ఈ కేసు ద్వారానే చట్టంలోని మతపరమైన మినహాయింపులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)ను ఉల్లంఘిస్తున్నాయా లేదా అనే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది.**

**ఇటీవల భారత విదేశాంగ శాఖ "పాస్‌పోర్ట్ అనేది కేవలం అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఉపయోగపడే గుర్తింపు పత్రం మాత్రమే కానీ, అది దేశ పౌరసత్వానికి తిరుగులేని..Conclusive రుజువు కాదు" అని స్పష్టం చేసింది.**

ఈ ప్రకటన దేశవ్యాప్తంగా పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలపై సరికొత్త బహిరంగ చర్చకు దారితీసింది.

నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (NRC) దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఒకే ఒక పౌరసత్వ గుర్తింపు కార్డును తీసుకురావాలా లేదా అనే దానిపై రాజకీయ, సామాజిక చర్చలు ఇప్పుడు చురుగ్గా సాగుతున్నాయి.

భారత పౌరులు కేవలం భావోద్వేగాలతో కాకుండా మన భారత దేశ రాజ్యాంగం గురించి, భారత చట్టాల గురించి, భారతదేశ చరిత్ర గురించి లోతైన అవగాహనతో మెలగాల్సిన అవసరం ఉంది.

### Citizenship Certificate

భారతదేశంలో పౌరసత్వ దరఖాస్తులను పరిశీలించి, తుది పౌరసత్వ ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే కీలక కేంద్ర ప్రభుత్వ సంస్థ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ.

పౌరసత్వ చట్టం, 1955 ప్రకారం జాతీయతకు సంబంధించిన విషయాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకే తుది అధికారం ఉన్నప్పటికీ, దీని పరిపాలనా ప్రక్రియ స్థానిక, రాష్ట్ర మరియు కేంద్ర స్థాయిలలో జరుగుతుంది.

### దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ

స్థానిక స్థాయి (కలెక్టర్/జిల్లా మేజిస్ట్రేట్): పౌరసత్వ నమోదు లేదా సహజీకరణ (Naturalisation) కోసం దరఖాస్తులను మొదట దరఖాస్తుదారుడు నివసించే స్థానిక జిల్లా కలెక్టర్ లేదా జిల్లా మేజిస్ట్రేట్ (DM) కి సమర్పించాలి. కలెక్టర్ దరఖాస్తుదారుడి వివరాలను మరియు పత్రాలను ధృవీకరిస్తారు.

**రాష్ట్ర ప్రభుత్వ స్థాయి**

కలెక్టర్ ధృవీకరించిన ఆ దరఖాస్తును సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖకు పంపుతారు.

కేంద్ర స్థాయి (హోం మంత్రిత్వ శాఖ)

రాష్ట్ర ప్రభుత్వం ఆ దరఖాస్తును సమీక్షించి, న్యూఢిల్లీలోని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (MHA) కు చెందిన ఫారినర్స్ డివిజన్‌కు..Foreigners Division కు బదిలీ చేస్తుంది.

MHA కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థల ద్వారా తుది భద్రతా తనిఖీలను నిర్వహించి, పౌరసత్వం మంజూరు చేయడానికి ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత అధికారికంగా ధృవీకరణ పత్రాన్ని జారీ చేస్తుంది.

ఈ పౌరసత్వ సర్టిఫికేట్ జారీ వెనుక ఉన్న ఈ మొత్తం ప్రాసెస్ ఇప్పుడిప్పుడే అందరికీ అర్థమవుతున్నది.

**ఇన్నాళ్ళూ భారతదేశాన్ని ఒక ధర్మ సత్రం లాగా భావిస్తూ వచ్చినవారికి ఈ వ్యవహారం మింగుడుపడదు.**

**■ ఆధార్ కార్డ్,రేషన్ కార్డ్,రేషన్ కార్డ్ సంపాదించి చివరికి భారత పాస్ పోర్ట్ తీసుకుంటే చాలు ఇక ఎవ్వరూ ఏమీ చేయలేరనే ధీమా తో అక్రమ చొరబాటు దారులు దర్జాగా బతికేస్తున్నారు.దేశ పౌరసత్వం చులకనగా లభించే తాయిలం కాదు..భారత పౌరసత్వం ఒక బాధ్యత గల ప్రభుత్వ ధృవీకరణ అని మెల్లమెల్లగా ప్రజలకు అర్థం కావడం ప్రారంభమయ్యింది.**

భారత్ మాతా కి జై

# ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

### రైతు భరోసా, కౌలు భరోసా, కూలీ భరోసా నిధులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 1:**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రైతులకు రూ.15,000 రైతు భరోసా, కౌలు రైతులకు రూ.15,000 కౌలు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12,000 కూలీ భరోసా నిధులను ఎలాంటి జాప్యం లేకుండా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇల్లందకుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని రైతాంగం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగు ఖర్చులు రోజురోజుకూ పెరుగుతుండగా, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు భారీగా పెరిగి రైతులపై అదనపు భారం మోపుతున్నాయని అన్నారు. పంటల దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోవడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు.భూమి స్వంతంగా లేక కౌలుకు భూములు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని ఆయన తెలిపారు. పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని సాగు చేస్తున్న కౌలు రైతులు నష్టాల బారిన పడుతున్నారని, ప్రభుత్వ భరోసా వారికి అత్యవసరమని అన్నారు. అలాగే వ్యవసాయ పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యవసాయ కూలీలు ఉపాధి కొరత, పెరుగుతున్న జీవన వ్యయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.ప్రభుత్వం ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉందని చెల్పూరి రాము పేర్కొన్నారు. రైతు భరోసా, కౌలు భరోసా, కూలీ భరోసా పథకాల అమలుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కొంత ఉపశమనం కలుగుతుందని అన్నారు.అదేవిధంగా రైతులకు పంటల వారీగా గిట్టుబాటు ధరలు ప్రకటించి సమర్థవంతంగా అమలు చేయాలని, నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగు సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని రకాల సబ్సిడీలు పారదర్శకంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతాంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తే



తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. రైతుల హక్కుల సాధన, సంక్షేమం కోసం తెలంగాణ రైతు సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని చెల్పూరి రాము స్పష్టం చేశారు.

# సార్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్



**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూలై 1:**

వీణవంక మండల కేంద్రంలోని 105వ పోలింగ్ బూత్‌లో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సార్ ) కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారి ( బి ఎల్ వో ) పద్మతో కలిసి కార్యక్రమాన్ని పరిశీలించి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు మరియు సవరణల ప్రక్రియ గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎండీ సాహెబ్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సవరణ చేసుకోవాలని కోరారు.ప్రభుత్వం, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన తెలిపారు. బూత్ స్థాయిలో ఎన్నికల అధికారులు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓ పద్మతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఓటర్లు పాల్గొన్నారు.

# భువనగిరి రాజ్యాధికార సమరభేరికి హాజరుకావాలి

## మున్నూరు కాపు జర్నలిస్టుల నాయకులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆహ్వానం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 01:**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ అధికారంలో జనాభాకు తగిన వాటా కల్పించాలనే లక్ష్యంతో జులై 5న భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభకు హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, పార్టీ నాయకులతో కలిసి మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏబూసీ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా నాయకుడు పంతాటి రవీందర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి సభకు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా దాట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలే అధిక జనాభా కలిగి ఉన్నప్పటికీ రాజకీయ అధికారం, కీలక పదవులు, విధాన నిర్ణయాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఏర్పడటానికి ఈ వర్గాల ఓట్లే కీలకమైనప్పటికీ, అధికారంలో మాత్రం వారికి తగిన స్థానం దక్కడం లేదని పేర్కొన్నారు."ఓట్లు మావి -- సీట్లు మరొకరివి" అనే పరిస్థితికి ముగింపు పలికి, జనాభాకు అనుగుణంగా రాజకీయ అధికారంలో వాటా సాధించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సామాజిక న్యాయం అనేది కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కూడా ఉండాలని అన్నారు.రాజ్యాధికారం లేకుండా బహుజన



వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని, అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలన్నీ ఐక్యంగా ముందుకు వచ్చి తమ రాజకీయ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# ఎన్‌టిపిసిలో జాతీయ వైద్యుల దినోత్సవం

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), జులై 1:**

ఎన్‌టిపిసి ధన్వంతరి ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం బుధవారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సిజిఎం ముకుల్ రాయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అదేవిధంగా రామగుండం జిఎం మనీష్ అగర్వాల్, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జిజిహెచ్) సీనియర్ ఆర్ఎంఓ డాక్టర్ కృపాబి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ అధికారులు, విభాగాధిపతులు, దీప్తి మహిళా సమితి(డిఎంఎస్) ప్రతినిధులు, గుర్తింపు పొందిన యూనియన్లు, సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సిఎంఓ) లహరి స్వాగతోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకునే దిగ్గజ వైద్యుడు డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్‌కు పుష్పాంజలి ఘటించారు. సమాజ ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడటంలో వైద్యులు అందించే అమూల్యమైన సేవలు, అంకితభావం, నిస్వార్థతను గుర్తించేందుకు ఒక ప్రత్యేక నివాళి వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూరుస్తూ, విచ్చేసిన వైద్యులు ఒత్తిడి నిర్వహణపై ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులలో మానసిక శ్రేయస్సు యొక్క ప్రాముఖ్యతను, ఇతరులకు సేవ చేస్తున్నప్పుడు స్వీయ సంరక్షణ ఆవశ్యకతను వివరించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 02, 2026

## డాక్టర్స్ డే -- చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా వాసవి క్లబ్ ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 1**



జమ్మికుంట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా సీఏ శివనాధుని మహతి, డా. శివనాధుని శ్రీనివాస్, డా. ముక్క శరత్, డా. ముక్క మౌనిక (కార్తికేయ హాస్పిటల్, బస్టాండ్)లను ఘనంగా సన్మానించారు. సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న వారిని అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు గుడివాడ వెంకట సతీష్, ప్రధాన కార్యదర్శి రేణికుంట రాజు, ఆర్థిక కార్యదర్శి అయితు శ్రీనివాస్, జోన్ చైర్‌పర్సన్ అయితు రమేష్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ అయితు సుధాకర్‌తో పాటు క్లబ్ సభ్యులు వినయ్, రాజగోపాల్, సతీష్, వెంకన్న, సత్యం, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శివశంకర్, సాంబన్న, రాజేందర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సభ్యులందరికీ వాసవి క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి -- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 1:**
జమ్మికుంట పట్టణంలోని పీవీఆర్ గార్డెన్స్‌లో జరిగిన నవ్యశ్రీ -- శివకుమార్ వివాహ వేడుకకు హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి , జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.స్థానిక దొడ్డే శ్రీకాంత్ చెల్లెలు నవ్యశ్రీ వివాహ మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు శ్రేయోభిలాషుల సమక్షంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివాహ వేడుకకు విచ్చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ నూతన దంపతులను ఆశీర్వదిస్తూ వారి దాంపత్య జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుకలో పాల్గొన్న అతిథులు నూతన జంటకు ఆశీస్సులు అందజేస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొలుగురి సురేష్, ఎగిత అశోక్, దిడ్డి రాము, బోగం వెంకటేష్, గాజుల భాస్కర్, జక్కే రవీందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి -- తహసీల్దార్‌కు సీపీఐ వినతి



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 1:**
ఇల్లందకుంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన స్థలంలేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు ఇల్లందకుంట మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.సీపీఐ మండల కార్యదర్శి మాదారపు రత్నాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, మండలంలోని అనేక మంది నిరుపేదలు స్వంత ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలో లేదా తాత్కాలిక నివాసాల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ భూములను కేటాయించాలని, అలాగే ఇందిరమ్మ గృహ పథకం కింద ఇళ్లు మంజూరు చేసి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి, సమ్మయ్య తదితరులు పాల్గొని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

## 7వ వార్డు దుర్గా కాలనీలో ఏళ్ల నాటి తాగునీటి సమస్యకు పరిష్కారం

**చేతి పంపు మరమ్మతులతో ప్రజలకు ఊరట -- ఫెరోజ్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 1**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో ఉన్న దుర్గా కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీలో ఉన్న చేతి పంపు చాలా కాలంగా నీరు రాక పనికిరాని స్థితిలో ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడగా, వృద్ధులు, మహిళలు, చిన్నారులు అనేక కష్టాలు పడుతున్నారు.ఈ సమస్యను స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సామాజిక కార్యకర్త ఫెరోజ్ దృష్టికి కూడా తీసుకువచ్చారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఫెరోజ్ వెంటనే స్పందించి చేతి పంపు మరమ్మతు పనులను చేపట్టించారు. సాంకేతిక నిపుణుల సహాయంతో చేతి పంపును పూర్తిగా పరిశీలించి, లోపల దెబ్బతిన్న పైపులను తొలగించి కొత్త పైపులు అమర్చారు. అలాగే నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా అవసరమైన కొత్త సామగ్రిని బిగించి పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించారు.మరమ్మతుల అనంతరం చేతి పంపు తిరిగి పనిచేయడం ప్రారంభించడంతో దుర్గా కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చాలా కాలంగా నిలిచిపోయిన సమస్యకు పరిష్కారం చూపిన ఫెరోజ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫెరోజ్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. వార్డులో ఎక్కడ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని వెల్లడించారు.దుర్గా కాలనీలో చేతి పంపు మరమ్మతులు పూర్తవడంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడమే కాకుండా, నీటి కోసం పడుతున్న ఇబ్బందులు కూడా



తొలగిపోయాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే ఫెరోజ్ సేవాభావాన్ని వారు కొనియాడారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులకు ఘన సన్మానం

**సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవి -- యువ నాయకుడు పొనగంటి రవీందర్ (పీజేఆర్)**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 1:**
జాతీయ వైద్యుల దినోత్సవం (నేషనల్ డాక్టర్స్ డే) సందర్భంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉడుగుల సురేష్, డాక్టర్ కం శెట్టి కిషోర్, డాక్టర్ ముషం సురేష్ ఆకుల శ్రీనివాస్ లను యువ నాయకుడు పొనగంటి రవీందర్ (పీజేఆర్) ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పొనగంటి రవీందర్ మాట్లాడుతూ, వైద్య వృత్తి అనేది కేవలం ఉద్యోగం కాదని, అది మానవ సేవకు ప్రతీక అని అన్నారు. రోగుల ప్రాణాలను కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడే వైద్యులు నిజమైన సేవామూర్తులని కొనియాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని, సమాజ నిర్మాణంలో వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ప్రత్యేకంగా కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో వైద్యులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. అలాంటి సేవాభావం కలిగిన వైద్యులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జమ్మికుంట ప్రాంత



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ విశేష గుర్తింపు పొందిన డాక్టర్ ఉడుగుల సురేష్, డాక్టర్ కం శెట్టి కిషోర్, డాక్టర్ ముషం సురేష్.ఆకుల శ్రీనివాస్ లు ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.వైద్యులు అందించే సేవల వల్ల ఎన్నో కుటుంబాల్లో ఆనందం నెలకొంటుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి డాక్టర్లు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై సేవలందిస్తున్న వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.సన్మానానికి స్పందించిన వైద్యులు మాట్లాడుతూ, తమ సేవలను గుర్తించి గౌరవించిన యువ నాయకుడు పొనగంటి రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం



మరింత నిబద్ధతతో పనిచేస్తామని చెప్పారు. వైద్య వృత్తిలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వైద్యుల సేవలను గుర్తించి వారిని సత్కరించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో వైద్యులకు ఉన్న గౌరవం, ప్రాధాన్యతను యువతకు తెలియజేసే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, యువకులు, వైద్యుల అభిమానులు పాల్గొని జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల రాజేందర్‌కు ఘన సన్మానం

**బీసీల అభ్యున్నతికి ఆకుల రాజేందర్ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించిన మున్నూరు కాపు జర్నలిస్టుల పోరం నాయకులు**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 1**
కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల రాజేందర్‌ను జమ్మికుంట మండల మున్నూరు కాపు జర్నలిస్టులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఎబూషి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆకుల రాజేందర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడని అన్నారు. బీసీ వర్గాల సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తూ వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ పదవిలో ఆయన మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లాలోని బీసీ వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం కరీంనగర్ జిల్లా నాయకులు పంతాటి రవీందర్ మాట్లాడుతూ, ఆకుల రాజేందర్ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ప్రజల మధ్య పని చేస్తూ ఈ స్థాయికి ఎదిగారని తెలిపారు. పార్టీ ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీసీల సంక్షేమం, యువత అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం మరింతగా శ్రమిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లాలో బీసీలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.సన్మానానికి స్పందించిన ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, యువతకు అవకాశాల



కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. మున్నూరు కాపు జర్నలిస్టులు అందించిన ఈ సన్మానం తనకు మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జర్నలిస్టులు ఎబూషి శ్రీనివాస్, పంతాటి రవీందర్, దాట్ల శ్రీనివాస్, కోలకాని రాజేందర్, ఎబూషి సంపత్ తదితరులు పాల్గొని ఆకుల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఔదార్యం -- పూర్వ పాఠశాలకు రూ.12 వేల విలువైన పోర్టబుల్ సౌండ్ సిస్టం విరాళం

**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూలై 1:**
విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసే ప్రభుత్వ ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంటారు. అలాంటి ఆదర్శ ఉపాధ్యాయుడిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీణవంకలో 14 సంవత్సరాల పాటు సేవలందించిన గణిత ఉపాధ్యాయుడు మ్యాకమల్ల శ్రీనివాస్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తాను పనిచేసిన పూర్వ పాఠశాలకు రూ.12 వేల విలువైన పోర్టబుల్ సౌండ్ సిస్టంను అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.2009 నుండి 2023 వరకు వీణవంక జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా సేవలందించిన మ్యాకమల్ల శ్రీనివాస్ ప్రస్తుతం జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ జమ్మికుంటకు బదిలీపై వెళ్లారు. అయితే తాను పనిచేసిన పాఠశాల పట్ల ఉన్న అనుబంధంతో విద్యార్థుల కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా పోర్టబుల్ సౌండ్ సిస్టంను అందజేశారు.ఈ సౌండ్ సిస్టంను జిల్లా విద్యాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మ్యాకమల్ల శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయమని, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం గొప్ప విషయమని కొనియాడారు.ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీనివాస్ గారు గణిత ఉపాధ్యాయునిగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఎన్సీసీ అధికారిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉన్న సమయంలో అదనపు బాధ్యతలను కూడా స్వీకరించి విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు.యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల విజయ్ కుమార్ మాట్లాడుతూ, మ్యాకమల్ల శ్రీనివాస్ సేవా దృక్పథం కలిగిన ఉపాధ్యాయుడని అన్నారు. గతంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన విద్యార్థుల కోసం విరాళాలు సేకరించి వారి పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి మానవత్వాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఎన్సీసీ అధికారిగా ఆయన చేసిన



కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.సోషల్ సర్వీస్ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయడం ద్వారా సేవా భావం, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఆయన అహర్నిశలు శ్రమించారని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. పాఠశాల పట్ల ఆయన చూపుతున్న ప్రేమాభిమానాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొని మ్యాకమల్ల శ్రీనివాస్‌ను అభినందించారు.